క్లుప్తంగా...

ఎల్లమ్మ దేవాలయం ఈఓ అన్నపూర్ణ బదిలీ

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం కార్యనిర్వాహణ అధికారి ఎస్.అన్నపూర్ణ బదిలీ అయ్యారు. నూతన ఈఓగా కుంట నాగ రాజును నియమించారు. బదిలీపై వెళ్తున్న అన్నపూర్ణ సోమవారం నాగరాజుకు బాధ్యతలు అప్పగించారు. రాయల సేవా సమితి ఆధ్వర్యంలో అన్నపూర్ణకు ఆత్మీయ వీడ్కోలు పలుకుతూ కొత్త ఈఓకు ఆహ్వానం పలికారు. ఇరువురికి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ఛైర్మన్ సాయిబాబాగౌడ్,పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన నూతన తహసీల్దార్



అడ్డగుట్ట: మారేడ్‌పల్లి మండల నూతన తహశీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పద్మ సుందరి సోమవారం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను సీతాఫల్‌మండిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మార్యదపూర్వకంగా కలిశారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



సనత్‌నగర్: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనల గురించి తెలుసుకోవడమే కాకుండా తమ కుటుంబసభ్యులకు కూడా అవగాహన కల్పించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేటలోని హీరో పార్కు వద్ద సోమవారం గీతాంజలి పాఠశాల విద్యార్థులకు, సిబ్బందికి ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్వోను కలిసిన మీసేవా కేంద్ర నిర్వాహకులు




అడ్డగుట్ట: మారేడ్‌పల్లి మండల తహశీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పద్మ సుందరిని మండల పరిధిలోని మీసేవా కేంద్ర నిర్వాహకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మీ సేవా కేంద్ర నిర్వాహకులు కుమార్ వంశీ, దేవయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం



బౌద్ధనగర్: పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు తాగించడం ఎంతో ఆరోగ్యకరమని కార్పొరేటర్ కంది శైలజ చెప్పారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం అశోక్ నగర్‌లోని కమ్యూనిటీహాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాల విలువల గురంచి బాలింతలకు వివరించారు. ఐసీడీఎస్ డీడబ్ల్యూవో అక్కేశ్వరరావు, సీడీపీఓ సునంద, సూపర్‌వైజర్ జాహ్నవి, జ్యోతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ'లో మరిన్ని సదుపాయాలు



గాంధీ ఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో పేద రోగులకు మరిన్ని మెరుగైన వైద్యసేవలు, మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నారు. ఈమేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, ఆర్ఎంఓ-1 జయకృష్ణలు జిల్లా కలెక్టర్, గాంధీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) ఛైర్మన్ అనుదీప్ దురిశెట్టిని సోమవారం కలిసి పలు అంశాలపై చర్చించారు. గాంధీలో నూతనంగా నిర్మిస్తున్న ఎంసీహెచ్ భవనం వరకు ఆక్సిజన్ పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.18 లక్షలు హెచ్‌డీఎస్ నుంచి కేటాయింపు, కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ సంస్థల ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వేతన బకాయిలు, నూతన నైట్ షెల్టర్, డైట్ క్యాంటిన్ భవనాలు, మౌలిక వసతులు వంటి అంశాలపై చర్చించినట్లు సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు. త్వరలోనే గాంధీఆస్పత్రిని సందర్శించి హెచ్‌డీఎస్ సమావేశంలో అభివృద్ధి పనులతోపాటు పలు అంశాలపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకునేందుకు కలెక్టర్ అంగీకరించారని వివరించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్‌కు పూలమొక్కను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన బోనాల వేడుకలు



అమ్మవారి జల్లి కడవ ఊరేగింపు



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ ప్రత్యేక పూజలు.



డిప్యూటీ స్పీకర్ టి. పద్మారావు తనయులు రామేశ్వర్ గౌడ్, కిరణ్ గౌడ్‌ల ప్రత్యేక పూజలు

బన్సీలాల్‌పేట్: అమ్మవారి బోనాల వేడుకల్లో భాగంగా సోమవారం బన్సీలాల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో అమ్మవారి రంగం, గావు, జల్లి కడవ కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి బ్యాండ్ మేళాల మధ్య అమ్మవారి జల్లి కడవ ఊరేగింపు కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. బ్యాండ్ చప్పుళ్ల మధ్య జల్లి కడవ కార్యక్రమం ఘనంగా జరిగింది. బోయిగూడ, బన్సీలాల్‌పేట్, బోలక్‌పూర్, గొల్లకొమురయ్య కాలనీ, సున్నంబట్టీ, రైల్ కళారంగ్ బస్తీ, బండమైసమ్మ నగర్, ఐడిహెచ్ కాలనీ తదితర ప్రాంతాల్లోని దేవాలయాల ముందు వందలాది మంది నృత్యాలు చేస్తూ బోనాల పండుగ వేడుకలను ఆనందోత్సాల మధ్య నిర్వహించుకోవడం కనిపించింది. పలు దేవాలయాల్లో రంగం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రంగం కార్యక్రమంలో భవిష్య వాణిని విన్పించారు. బోనాలు తృప్తిగా చేశారని..... వర్షాలు పడి ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని రంగం కార్యక్రమంలో పేర్కొన్నారు. సోమవారం బన్సీలాల్‌పేట్ అమ్మవారి దేవాలయాన్ని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

కనుల పండువగా ఫలహారపు బండ్ల ఊరేగింపు

బోనాల వేడుకల్లో భాగంగా నిర్వహించిన అమ్మవారి ఫలహారపు బండ్ల ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి బ్యాండ్ మేళాలతో పోతరాజుల వీర వీరంగాల మధ్య, యువత నృత్యాలతో ఈ ఊరేగింపు కోలాహలంగా సాగింది. యువత పెద్ద ఎత్తున డ్యాన్స్‌లతో బోనాల సంబరాలు అంబరాన్ని తాకాయి. బీజేఆర్ నగర్ నుంచి బొడ్డు మహేష్, బన్సీలాల్‌పేట్ నుంచి ఎం. రవికుమార్, కొండూరు మహేష్ తదితరుల ఆధ్వర్యంలో అమ్మవారి ఫలహారపు బండ్ల ఊరేగింపు అత్యంత వైభంగా సాగింది. బోనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎన్. రవి భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

హాస్పిటల్ ఏర్పాటు కోసం కృషి చేస్తాం



రిలే దీక్షలను విరమింపజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

లాలాపేట: మాణికేశ్వర్‌నగర్‌లో ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణంతో పాటు బస్తీ వాసుల కోసం ఫంక్షన్ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేయి చేయి కలుపుదాం భవిష్యత్ హాస్పిటల్ నిర్మాద్దామంటూ చేపట్టిన రిలే దీక్షలు 126 రోజులకు చేరాయి. ఈ సందర్భంగా సోమవారం డిప్యూటీ స్పీకర్ పద్మారావు దీక్షా శిబిరానికి వచ్చి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ ఇంత కాలం హాస్పిటల్ కోసం చేస్తున్న రిలే దీక్షలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి బస్తీ వాసులకు కోసం మంచి నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఎంత కాలం అనేది చెప్పలేము హాస్పిటల్ ఏర్పాటు మాత్రం ఖచ్చితంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు ఆలకుంట హరి, గండికోట విజయ్‌కుమార్, వేముల శ్రీనివాస్, ఓర్సు శేఖర్, కృష్ణ, ఆలకుంట లింగయ్య, రవితేజ, ప్రశాంత్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా



ఎమ్మార్వో పద్మ సుందరికి వినతిపత్రం సమర్పిస్తున్న ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు

అడ్డగుట్ట: గత ఎన్నికల సమయంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోకపోవడం శోచనీయమని ఎంపీజేఎస్ గిరిజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తుకారాం నాయక్ పేర్కొన్నారు. సోమవారం ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో మారేడ్‌పల్లి మండల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ..రెండు సార్లు కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ ప్రజల సమస్యలు పరిష్కారం అవ్వడం లేదన్నారు. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు, ప్రజలకు అందుబాటులో లేని ఉపాధి పనులతో అనేక అవస్థలు పడుతున్నారన్నారు. నాయకులు జీ. మల్లేష్, బి. యాదగిరి, కిష్టయ్య, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో జాతీయ సదస్సు ప్రారంభం



సావనీరును ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో న్యాయశాస్త్రంపై జాతీయ సదస్సు ప్రారంభమైంది. సోమవారం దూరవిద్య కేంద్రంలో75 సంవత్సరాల భారత రాజ్యాంగం అనుభవాలు దేశ ప్రజల భవిష్యత్తు అనే అంశం పై జరిగే మూడు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. తొలి రోజు కార్యక్రమానికి డీన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ అధ్యక్షత వహించగా మానవ హక్కుల కమీషన్ జస్టిస్ చంద్రయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాజ్యాంగం ద్వారానే దేశ పౌరులకు సమాన హక్కులు వచ్చాయన్నారు. అనంతరం వినోద్‌కుమార్ ఎడిట్ చేసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, సీడీఈ డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి, యూజీసీ డీన్ ప్రొ.మల్లేశం, జీపీ లా కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయండి



కార్యక్రమంలో పాల్గొన్న బీవైఎస్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: బీపీ మండల్ సిఫారులను అమలు చేయాలని భారత యాదవ సమితి (బీవైఎస్) నేతలు డిమాండ్ చేశారు. సోమవారం బీవైఎస్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీలో బీపీ మండల్ డేను ఘనంగా జరుపుకున్నారు. బీపీ మండల్‌కు భారత రత్న ప్రకటించి జయంతులు, వర్ధంతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని, ప్రభుత్వ నిధులతో విగ్రహాలు ఏర్పాటు చేయాలని, దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని బీవైఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ సిద్ది రమేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, తోకల శ్రీనివాస్‌యాదవ్, బాలచందర్‌యాదవ్, చక్రవర్తి, నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో కరాటే కోచ్ పూర్ణచందర్

బౌద్ధనగర్: కలకత్తాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో జరిగిన 7వ కరాటే ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జామై ఉస్మానియా సైక్లింగ్ స్టేడియంకు చెందిన కరాటే స్టూడెంట్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదుగురు స్టూడెంట్లు 1 గోల్డ్, 3 సిల్వర్, 5 బ్రాంజ్ పతకాలు సాధించారు. మోహన్ కృష్ణ గోల్డ్, బ్రౌన్స్ పతకాలు, రిథ్విక్ రెండు సిల్వర్ పతకాలు, అజయ్ కుమార్ ఎండు బ్రౌన్స్ పతకాలు, శరత్ చంద్ర బ్రౌన్స్, శ్రేష్ఠ రెండు బ్రౌన్స్ పతకాలను సాధించినట్లు కరాటే కోచ్ పూర్ణ చందర్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

సనత్‌నగర్: సర్కారు బడుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం సనత్‌నగర్ అశోక్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఆమె సందర్శించారు. పాఠశాలలో సమస్యలు, ఇబ్బందులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా పెట్టకపోవడంతో ఇంటి నుంచే భోజనాలు తెచ్చుకుంటున్నామని విద్యార్థులు వివరించారు. రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పది రోజుల్లో నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, విద్యాశాఖ ఆర్జేడీ విజయలక్ష్మి, జేడీ ప్రసాద్, అదనపు కలెక్టర్ అభిషేక్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ఏఎంఓహెచ్ డాక్టర్ భార్గవ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంఈఓ ఆంజనేయులు, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జెండా ఎగురవేస్తాం

బౌద్ధనగర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. డివిజన్ అధ్యక్షుడు గరిగె ప్రవీణ్ ఆధ్వర్యంలో సోమవారం బౌద్ధనగర్‌లో టీడీపీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీ ని మరింత పటిష్టపరచాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు.

క్రైం కార్నర్..

వృద్ధురాలి ఆత్మహత్య

అడ్డగుట్ట: మానసికస్థితి సరిగాలేని ఓ వృద్ధురాలు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన మేరకు.. అడ్డగుట్ట ఏ సెక్షన్‌కు చెందిన పార్వతి(60)కి మానసికస్థితి సరిగాలేదు. అయితే మద్యానికి బానిసైన ఈ వృద్ధురాలు సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం



జ్యోత్స్న

బౌద్ధనగర్: షాపునకు వెళ్లొస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పార్సిగుట్ట ప్రాంతానికి చెందిన జ్యోత్స్న(28) ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 7న ఉదయం 11 గంటల సమయంలో షాపునకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన జ్యోత్స్న మళ్లీ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా, బంధువులను వాకబు చేసినా ఫలితం కనిపించలేదు. చేసేదేమి లేక సోమవారం రాత్రి వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వాహన పార్కింగ్ ప్రదేశంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గోపాలపురం ఎస్ఐ దీక్షిత్‌రెడ్డి తెలిపిన మేరకు.. మృతుడికి 50 నుంచి 55 సంవత్సరాల వయసుంటుందని, ఒంటిపై నీలం రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. స్థానికులను విచారించగా ఇదే ప్రాంతంలో యాచిస్తూ జీవనం గడుపుతుంటారని తెలిపారు. మృతదేహాన్ని గుర్తింపు నిమిత్తం గాంధీ మార్చురీలో ఉంచారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

తాళం వేసివున్న ఇంట్లో చోరీ

బౌద్ధనగర్: తాళం వేసివున్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడి బంగారు నగలతో పాటు నగదు ఎత్తుకెళ్లిన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ తెలిపిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామ్ నగర్ గుండు ప్రాంతానికి చెందిన సత్యనారాయణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి. అయితే నెల క్రితం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. కాగా, ఈ నెల 6న తాళం వేసి ఉన్న ఇంటి డోర్ తెరిచి ఉండడాన్ని గమనించిన స్థానికులు సత్యనారాయణకు ఫోన్ చేసి చెప్పారు. మరుసటి రోజు వచ్చిన సత్యనారాయణ ఇంట్లోకి వెళ్లి చూడగా లాకర్ తెరిచి ఉంది. అందులో ఉన్నటువంటి రెండు జతల బంగారు కమ్మలు, గోల్డ్ కోటెడ్ వాచ్చి, రూ.6 వేల నగదు కనిపించకుండా పోయింది. దీంతో వెంటనే వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముస్లిం గ్రేవ్‌యార్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేస్తాం



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ ముస్లిం గ్రేవ్‌యార్డు నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రకటించారు. గ్రేవ్‌యార్డుకు కేటాయించిన స్థలాన్ని మంత్రి వివిధ శాఖల అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. అందులో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూడా త్వరగా తొలగించాలని, లెవలింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కొందరు పనిగట్టుకొని గ్రేవ్‌యార్డు నిర్మాణంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని పట్టించుకోవద్దని చెప్పారు. కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు తదితరులు ఉన్నారు.

మిషన్ ఇంద్రధనస్సును సద్వినియోగం చేసుకోండి



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా టీకాలు వేయించాలని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి సూచించారు. అడ్డగుట్టలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా సోమవారం వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన పిల్లలందరికీ తప్పనిసరిగా టీకా వేయించాల్సిన బాధ్యత వారి తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాయి శంకర్, బీఆర్ఎస్ నాయకులు లింగాని తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ బైసన్ డివిజన్ ఆధ్వర్యంలో సాహిత్య ఉత్సవం



లిటరరీ ఫెస్ట్ ప్రారంభిస్తున్న రాధికా రాధకృష్ణన్

రసూల్‌పురా: ఆర్మీ బైసన్ డివిజన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే సృజనా త్మక సాధన, భావవ్యక్తీకరణ,సాహిత్య ఉత్సవం ప్రారంభమైంది. ఈ ఉత్సవాన్ని బైసన్ చైర్‌పర్సన్ రాధికా రాధకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023 ను పురస్కరించుకుని జాతీయ వాదం పెంపొందించే విధంగా బైసన్ రూపొందించిన వంటకాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ పుస్తక ప్రదర్శనను బొల్లారం, ఆర్‌కే పురం ఆర్మీ స్కూల్ విద్యార్థులు, కార్యక్రమానికి హాజరైన ఆహుతులు తిలకించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రహదారి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్థానిక కార్పోరేటర్ సామల హేమ సూచించారు. సురేష్ థియేటర్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు రూ. 69 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రహదారి నిర్మాణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. అంతర్గత రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఆల్విన్, బేగంపేట, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సుందర్ నగర్, మోడల్‌కాలనీ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు డీకేరోడ్డు, రోశయ్యలేన్, శివ బాగ్‌కాలనీ, టోపాజ్ బిల్డింగ్, నవదుర్గా జ్యువెలర్స్, ఏరియల్ టవర్స్, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

రాంగోపాల్‌పేట్: లాలాగూడ, మోండా, నెహ్రూనగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సికింద్రాబాద్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నాగార్జుననగర్ ఫీడర్ పరిధిలోని సండే మార్కెట్, నాగార్జుననగర్, శ్రీనివాస్ అపార్ట్‌మెంట్, శిర్డిసాయి నగర్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు సెయింట్ ఆన్స్ ఫీడర్ పరిధిలోని విద్యానికేతన్, సెయింట్ ఆన్స్ జూనియర్ కాలేజ్, సెయింట్ జాన్స్ కాలేజ్ ప్రాంతాల్లో, ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు బాటా ఫీడర్ పరిధిలోని ఆర్పీ రోడ్, గ్యాస్‌మండి, బాటనీ స్కూల్, వాటర్ వర్క్స్, బన్సీలాల్‌పేట్ క్లాస్ ఏ.బీ.సీ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు నట్రాజ్ ఫీడర్ పరిధిలోని మార్గదర్శి చిట్‌ఫండ్, ఆంధ్రాబ్యాంక్ ఏటీఎం, సీఎంఆర్ టెక్స్‌టైల్స్, చెన్నై షాపింగ్ మాల్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు హెచ్‌హెచ్‌కేబీ ఫీడర్ పరిధిలోని శ్రీరాంనగర్, కళానికేతన్ బ్యాక్ సైడ్, ఎన్టీపీసీ, మున్సిపల్ కార్మిక సంఘం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్ అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రి తలసాని



గద్దర్‌కు నివాళులు అర్పిస్తున్న డాక్టర్ రవీందర్‌గౌడ్

బన్సీలాల్‌పేట్: ప్రజా గాయకుడు గద్దర్ మరణం పీడిత వర్గాలకు ....తీరని లోటని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గద్దర్ అంతిమయాత్ర ఎల్‌బీ స్టేడియం నుంచి ట్యాంక్‌బండ్ మీదుగా సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డు బైబిల్ వద్దకు రాగానే మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ యాత్రలో పాల్గొని గద్దర్ పార్థీవ దేహానికి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున కళాకారులు, ప్రజలు ఈ అంతిమయాత్రలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు తలసాని సాయికిరణ్ యాదవ్, పవన్ కుమార్ గౌడ్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు

సనత్‌నగర్: ప్రజా గాయకుడు గద్దర్ మృతి సమాజానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. బల్కంపేటలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో గద్దర్‌కు ఆయన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి గద్దర్ చేసిన సేవలను కొనియాడారు. సమాజ అసమానతలు, శ్రామిక దోపిడీ, కులవివక్షపై తన పాటలతో తెలంగాణ పల్లె పల్లెనా చైతన్యపరిచారన్నారు. కార్యక్రమంలో నాయకులు కమల్ రాజ్, షాబాద్ సత్యనారాయణ, మణిమాల తదితరులు పాల్గొన్నారు.

మాజీ మేయర్ నివాళి

లాలాపేట: ప్రజా యుద్ధ నౌక గద్దర్ మరణం తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటనీ మాజీ మేయర్, బీజేపీ నాయకురాలు బండ కార్తీకరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం అల్వాల్‌లోని గద్దర్ నివాసంలో ఆయన పార్థీవ దేహం వద్ద పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు.

ఆర్పీరోడ్‌లో తుది వీడ్కోలు

రాంగోపాల్‌పేట్: ప్రజా యుద్ధనౌక, ప్రజా గాయకులు గద్దర్‌కు ఆర్పీరోడ్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం ఆయన మృతదేహాన్ని ఎల్‌బీ స్టేడియం నుంచి అల్వాల్‌లోని ఆయన నివాసానికి తరలిస్తూ అంతిమ యాత్ర నిర్వహించారు. ఆర్పీరోడ్‌లోని దర్గా ప్రాంతంలో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ వేదిక ఏర్పాటు చేయగా బీఆర్ఎస్‌తో పాటు పలువురు వచ్చి ఆయనకు నివాళులు అర్పించారు. అంతిమయాత్ర సందర్భంగా ఆయనకు వేదిక మీద నుంచి తుది వీడ్కోలు పలికారు. గద్దర్ సతీమణి విమల అంతిమ యాత్రకు ముందే ఎల్బీ స్టేడియం నుంచి ఇంటికి వెళుతూ మార్గ మధ్యమంలో వేదిక వద్ద ఆగి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి కన్నీరుమున్నీరుగా విలపించారు. శ్రీనివాస్‌గౌడ్, మహేష్ యాదవ్, అరుణ్, పబ్బా ప్రకాష్ నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.



నివాళులు అర్పిస్తున్న గద్దర్ సతీమణి, విమల



నివాళులర్పిస్తున్న బండ కార్తీకరెడ్డి